
గుల్లేపల్లిలో కంపెనీల వద్ద వ్యర్థాలు పడిన చోట పశుగ్రాసం కూడా మొలవని పరిసరాలు


గుల్లేపల్లిలో తరలించేందుకు సిద్ధంగా నిల్వ ఉంచిన వ్యర్థాలు


మల్లునాయుడుపాలెంలో రైతులు వినియోగిస్తున్న రసాయన వ్యర్థాలు

ఫార్మా వ్యర్థాలతో.. భయం భయం

- మండలంలో పలు చోట్ల విచ్చలవిడిగా డంపింగ్
- గ్రావెల్‌కు ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్న ప్రజలు
- భూమి, నీరు కలుషితం అవుతాయని నిపుణుల హెచ్చరిక

సబ్బవరం: మండలంలో ఫార్మా వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ డంపింగ్ చేయడం భయాందోళనలకు గురి చేస్తోంది. గతంలో ఈ వ్యర్థాలను రాత్రిపూట గుట్టు చప్పుడు కాకుండా వదిలిపెట్టేవారు. కానీ ఇటీవల ల్యాండ్ ఫిల్లింగ్ కోసం గ్రావెల్ రవాణాపై అనుమతులు లేకపోవడంతో కొంత మంది ప్రత్యామ్నాయంగా ఈ ఫార్మా వ్యర్థాలను కొనుగోలు చేసి వినియోగించడం ప్రారంభించారు. తక్కువ ధరకు లభించే ఈ రసాయన అవశేషాలను భూమి పూడ్చేందుకు, చదును చేసేందుకు ఉపయోగించడం వల్ల పరసరాలపై తీవ్ర దుష్ప్రభావం పడుతోంది.

హెచ్చరిస్తున్న నిపుణులు..

ఈ వ్యర్థాల్లో రసాయనిక పదార్థాలు, ద్రావకాలు, హానికర మిశ్రమాలు ఉంటాయి. వీటిని వేసిన ప్రదేశాల్లోని గడ్డిని పశువులు తినడం వల్ల వాటిపై తీవ్ర ప్రభావం పడుతుంది. పాల ఉత్పత్తి తగ్గుతుంది. పశు మరణాలు కూడా సంభవిస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షా కాలంలో ఈ వ్యర్థాలు కాలువల్లో కలిసిపోయి భూగర్భ జలాలు కలుషితం కావడానికి దారి తీసే ప్రమాదం ఉందని చెబుతున్నారు.


గుల్లేపల్లి కంపెనీలో ప్రాసెసింగ్ చేస్తున్న వ్యర్థాలు

మానవుల పైనా ప్రభావం..

వైద్య నిపుణులు చెబుతున్న దాని ప్రకారం ఈ రసాయనాలు మానవ శరీరంలోకి ప్రవేశిస్తే చర్మ వ్యాధులు, శ్వాస కోస సమస్యలు ఉత్పన్నమవుతాయి. గ్రామాల్లో సాగునీటి వనరులు కలుషితం కావడం, పిల్లల్లో అలర్జీలు, కడుపు సంబంధింత సమస్యలు వస్తాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పొలాలు, పశువుల పాకల వద్ద వినియోగం..

గతంలో పరవాడ సమీపంలోని ఫార్మా కంపెనీల నుండి భారీ వాహనాలలో రోడ్లకు ఇరువైపుల, నిర్మానుష్యంగా ఉండే ప్రదేశాల్లో రాత్రి పూట గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యర్థాలను డంప్ చేసేవారు. దీనిపై చుట్టు పక్కల ఉండేవారు అధికారులకు ఫిర్యాదు చేసేవారు. ఇటీవల ఈ ఫార్మా వ్యర్థాలను కొంత మంది పొలాలు, పశువుల పాకల వద్ద, ఇంటి పరిసరాల్లో వినియోగించుకుంటున్నారు. ఇటీవల ఈ వ్యర్థాలకు డిమాండ్ పెరగడంతో గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం పరిసర ప్రాంతాల్లోని కంపెనీల నుండి స్థానికంగా ఉండేవారు ట్రాక్టర్ రూ.1,000 నుండి రూ. 1,100 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి..

దీనిని కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు గాని స్థానికంగా ఉండే మండల స్థాయి అధికారులు గాని పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వాయు కాలుష్యం, దుమ్ము, రసాయన దుర్వాసన వ్యాపిస్తున్నప్పటికీ చర్యలు లేవని చెబుతున్నారు. ఇలా కొనసాగితే భవిష్యత్‌లో పశు సంపద, భూమి రెండూ నాశనమవుతాయి. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ఈ వ్యర్థాల పారవేతపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు..



మా గ్రామం సమీపంలోని కంపెనీల నుండి వచ్చే రసాయన వ్యర్థాలను స్థానికంగా ఉండే గ్రామస్తులు పశువుల పాకలు, ఇంటి ప్రాంగణంలో వేసుకుని వినియోగిస్తున్నారు. గుల్లేపల్లి సమీపంలోని కంపెనీల నుండి వచ్చే వ్యర్థాలను రూ.1,000 నుండి రూ.1,100 వెచ్చించి కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు.

– ఉప్పులి దుర్గారావు, గుల్లేపల్లి గ్రామం, సబ్బవరం మండలం

రసాయన వ్యర్థాల వినియోగం ప్రమాదకరం..



రసాయన వ్యర్థాల వినియోగం ప్రమాదకరం. బహిరంగ ప్రదేశాల్లోగాని, జన సంచారం ఉండే చోట్ల గానీ డంపింగ్ చేసినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అదే విధంగా ఈ వ్యర్థాలను గ్రావెల్‌కు ప్రత్యామ్నాయంగా వినియోగించడం సరికాదు. దీని ప్రభావంపై ప్రజలకు అవగాహన కలిగిస్తాం.

– బి. పద్మజ, ఎంపీడీవో సబ్బవరం, సబ్బవరం మండలం

క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా గరుడసేవ


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణమండపంలో గరుడ వాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. విశేషంగా హారతి అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామిని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు, ఎమ్మెల్యే కళా వెంకటరావు శనివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో వీరి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రం డిప్యూటీ ఈవో రాధ, సూపరింటెండెంట్‌లు వెంకటేశ్వరరావు, సత్య శ్రీనివాస్ అందజేశారు.

మద్యానికి బానిసైన వ్యక్తికి ఆశ్రయం


మద్యానికి బానిసైన కిషోర్‌ను రిహాబిలిటేషన్ కేంద్రంలో చేర్పిస్తున్న పోలీసులు

పెందుర్తి: తీవ్ర స్థాయిలో మద్యానికి బానిసై నిత్యం గొడవలు సృష్టిస్తున్న వ్యక్తికి పెందుర్తి పోలీసులు రిహాబిలిటేషన్ కేంద్రంలో ఆశ్రయం కల్పించారు. అప్పన్నపాలేనికి చెందిన పెలూరి కిషోర్ (42) నిత్యం మద్యం సేవిస్తూ ఇంటా, బయట గొడవలు సృష్టిస్తున్నాడు. దీనిపై అతడి తండ్రి మోహనరావు పెందుర్తి పోలీసులను ఆశ్రయించాడు. తన కుమారుడిని మద్యం బానిసత్వం నుంచి రక్షించాలని కోరాడు. స్పందించిన సీఐ కె.వి.సతీష్‌కుమార్ అతడిని చినముషిడివాడలోని న్యూలైఫ్ డ్రగ్ రిహాబిలిటేషన్ కేంద్రంలో చేర్పించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మానస


మోస మానస

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ – 19 బాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ముత్యాలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మోస మానస ఎంపికైంది. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మానస అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. మానసను పాఠశాల సిబ్బంది, ముత్యాలమ్మపాలెం గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు.

అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: పేద, అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయాన్ని సమర్థవంతంగా అందించి, న్యాయ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ కేసుల పరిష్కారం, న్యాయ సేవా పథకాల అమలు, గ్రామ స్థాయి వరకు న్యాయ సహాయాన్ని చేరవేయడంలో అందరి సహకారం కావాలన్నారు. ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గుదలతో మేలు


అడవివరంలో జీఎస్టీ తగ్గుదల వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్న అధికారులు

సింహాచలం: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించి ఎంతో మేలు చేసిందని డీటీవో జె.మాధవి, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఎం.గోవిందరావు తెలిపారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలను వివరిస్తూ అడవివరంలో శనివారం అవగాహన కల్పించారు. వాహనాల కొనుగోలుపై 20 నుంచి 15 శాతం, ఇన్సూరెన్స్ 15 నుంచి 5 శాతం, స్పేర్‌పార్ట్స్ 15 నుంచి 5 శాతంకి, లక్ష రూపాయలు దాటిన రిపేర్ వర్క్స్‌పై 10 శాతం, టైర్లపై 10 శాతం తగ్గుదల జీఎస్టీ ద్వారా లభించిందని తెలియజేశారు. పర్యాటక రంగానికి విస్తృత ప్రయోజనాలు కలిగాయని తెలిపారు. గదుల అద్దెలు తగ్గడం ద్వారా దేశీయ పర్యాటకం, వీకెండ్ ట్రిప్‌లు పెరుగుతాయని, తీర్థయాత్రలు, వ్యాపార పర్యటనలు, ఎకో టూరిజానికి భారీ ప్రోత్సాహం లభిస్తుందని తెలియజేశారు. తక్కువ ఖర్చుతో ట్రావెల్ ఏజెన్సీలు, స్థానిక టాక్సీలు, భోజనశాలలు లాభాలు పొందుతాయని తెలిపారు. కొత్త పెట్టుబడులకు అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

లంకెలపాలెంలో బొగ్గు లారీ బోల్తా


లంకెలపాలెం కూడలి వద్ద బొగ్గు లారీని తొలగిస్తున్న క్రేన్లు

పరవాడ: లంకెలపాలెం నాలుగు రోడ్ల కూడలి వద్ద శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ బొగ్గు లారీ బోల్తా పడింది. రాత్రి రెండున్నర గంటల సమయంలో ఎన్టీపీసీకి బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి బోల్తా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. పరవాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన క్రీడా పోటీలు


బాలికల విభాగంలో ఆల్‌రౌండ్ చాంపియన్స్‌గా నిలిచిన సబ్బవరం ఉన్నత పాఠశాల విద్యార్థినులు

సబ్బవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు శనివారం సాయంత్రంతో ఘనంగా ముగిశాయి. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. అండర్ – 14, అండర్ – 17 విభాగాల్లో బాల బాలికలకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆల్‌రౌండ్ చాంపియన్‌లుగా సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నిలిచారు. కార్యక్రమంలో సర్పంచ్ బోకం స్వామినాయుడు, మండల విద్యాశాఖాధికారులు లక్ష్మణరావు, రవీంద్రబాబు, మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కో ఆర్డినేటర్ అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందనలు


జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచిన గంగాధర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

పరవాడ: ఇటీవల తమిళనాడులో జరిగిన 44వ సబ్ జూనియర్ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో వాడచీపురపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పెదపూడి గంగాధర్ ప్రతిభ కనబరిచాడు. పోటీల్లో సింగిల్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి అందరి మన్ననలు పొందాడు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గంగాధర్‌ను హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు, పీఈటీలు వెంకటరావు, సన్యాసిరావు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

అమర్‌నాథ్‌పై చౌకబారు విమర్శలు మానుకోవాలి

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్


విలేకరులతో మాట్లాడుతున్న గండి రవికుమార్

సబ్బవరం: మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై వ్యక్తిగత దూషణలు చేస్తూ, పార్టీ నేతల మెప్పు కోసం దిగుజారుడుతనంతో మాట్లాడుతున్న మీరు ఎవరి దయతో ఈ స్థాయికి వచ్చారో తెలుసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీని ఉద్దేశించి ఆయన సోదరుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ విమర్శించారు. మండలంలోని మొగలిపురంలోని తన నివాసంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకొచ్చామని ఉదరగొడుతుందన్నారు. ఏపీ మంత్రి మండలి గూగుల్ సంస్థ రూ.87 వేల కోట్ల పెట్టుబడి పెట్టి 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని చెబుతుంటే, ఐటీ మంత్రి నారా లోకేష్ మాత్రం లక్షా 87 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రచారం చేస్తున్నారన్నారు. ఇలా విభిన్న ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో వాస్తవంగా ఎంత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారో గూగుల్ సంస్థ ప్రతినిధులతో ప్రకటిస్తే ఈ ప్రాంత వాసిగా వారిని సన్మానిస్తామని తమ నాయకుడు, మాజీ ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రకటించారన్నారు. దీనిపై గండి బాబ్జీ వ్యక్తిగత విమర్శలకు దిగుతూ దిగజారుడు మాటలు మాట్లాడడం తగదన్నారు.

ఉపాధి కల్పనలో స్థానికులకే ప్రాధాన్యమివ్వాలి


సమావేశమైన కుల సంఘాల నాయకులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించాలని 61వ వార్డు మల్కాపురానికి చెందిన పలు కులాల సంఘాల ప్రతినిధులు, ట్రేడ్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్ తదితర పరిశ్రమల్లో స్థానికేతరులకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై స్పందిస్తూ వీరంతా శనివారం మల్కాపురం గొల్ల వీధి వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు కులాల సంఘ నాయకులు, ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్, ఐవోసీ తదితర పరిశ్రమలకు అవసరమైన భూములను తమ గ్రామంలో ప్రజలే ఇచ్చారని తెలిపారు.

ఆయా పరిశ్రమల్లో స్థానికులకు మాత్రం ఉపాధి అవకాశాలు లేవన్నారు. తమ గ్రామంలో చాలా మంది నిరుద్యోగులకు సాంకేతిక పరంగా, ఉన్నత విద్య పరంగా అనుభవం ఉందని, వీరిని కాదని స్థానికేతర కార్మికులకు కాంట్రాక్టర్‌లు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై తామంతా ఐక్య పోరాటం చేసి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కలిపించుకుంటామన్నారు.

అంబులెన్స్‌ల కోసం సహకారం


అంబులెన్స్‌ల కోసం రూ.50 వేలు అందిస్తున్న దాడి ఉమామహేశ్వరరావు

పెందుర్తి: పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చుతున్న రెండు అంబులెన్స్ (మహాప్రస్థానం, అంబులెన్స్)ల కోసం వ్యాపారవేత్త దాడి రమణచిట్టి భారీ వితరణ చేశారు. రెండు వాహనాల కోసం రూ.50 వేలు సమకూర్చారు. ఆ నగదును పెందుర్తిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రమణచిట్టి కుమారుడు, వైఎస్సార్‌సీపీ 97వ వార్డు ఇన్‌చార్జి దాడి ఉమమహేశ్వరరావు కుమారుడు చేతుల మీదుగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్‌కు అందజేశారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

గోపాలపట్నం: స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి దాతృత్వం చూపడం ప్రశంసనీయమని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990–91 టెన్త్ బ్యాచ్‌కు చెందిన లక్ష్మణరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందజేసి బాసటగా నిలిచారు. రూ.30 వేల నగదు, నెలకు సరిపడా రేషన్ సరకులను శనివారం లక్ష్మణరావు భార్య, పిల్లలకు గణబాబు చేతుల మీదుగా అందించారు.

వేంకటాద్రిపై ముగిసిన చాతుర్మాస్య దీక్షలు




పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న చాతుర్మాస్య దీక్షలు శనివారం వైభవంగా ముగిసాయి. వేకువజామున స్వామి వారిని మేల్కొలిపి సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహించారు. అనంతరం సహస్ర నామార్చన, సహస్ర దీపార్చన జరిపారు. స్వామి సేవాకాలం అనంతరం 108 మంది దంపతులతో స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా చేశారు. మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులకు స్వామివారి అన్నప్రసాదం అందించారు. ఈవో నీలిమ, డీసీవో సన్యాసినాయుడు, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

షిప్‌యార్డ్ సమస్యలపై వినతి


ఎంపీ రాధాకృష్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సింధియా: షిప్‌యార్డ్‌లో నెలకొన్న పలు సమస్యలపై ఎంపీ కె.రాధాకృష్ణన్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. నగరంలోని డాబా గార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన 'ప్రభుత్వ రంగం – సామాజిక న్యాయం' అనే సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం లోక్‌సభ సభ్యుడు ఎంపీ రాధాకృష్ణన్‌ను షిప్‌యార్డ్ సీఐటీయూ నాయకులు కలిశారు. షిప్‌యార్డ్‌లో వర్క్ ఆర్డర్లు, ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, స్టాఫ్ అండ్ వర్కర్లను శాశ్వత పద్ధతిలో రిక్రూట్‌మెంట్ చేయాలని తదితర అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. షిప్‌యార్డ్ సీఐటీయూ అధ్యక్షుడు వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బి.ఎస్.ఎన్.రాజు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

'సెయింట్ జోసెఫ్'లో తిజారా ఫెస్ట్ సందడి


తిజారా ఫెస్ట్ వేడుకల్లో అతిథులు, అధ్యాపకులతో విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో కామర్స్–మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. జ్యోతి ఆధ్వర్యంలో తిజారా ఫెస్ట్–2025 వేడుకలు సందడి వాతావరణంలో జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి వేడుకలను ప్రారంభించారు. స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ నిపుణులు విద్యార్థులకు ఆర్థిక రంగం, మార్కెట్లపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కెప్టెన్ కె.సుజాత విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎం.జగదీష్‌కుమార్, ఆర్. పావని, కె.ప్రత్యూష, డాక్టర్ కె.రజని, డాక్టర్ దివ్య జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య సమస్యకు మొక్కలతో చెక్


స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంతోపాటు నగర వాసులను కాలుష్య సమస్య పట్టి పీడిస్తోందని, విరివిగా మొక్కలు నాటడమే దీనికి పరిష్కారమని 58వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ అన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వార్డులోని గుల్లలపాలెంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తమ ఇంటి వద్ద ఒక్క మొక్క నాటితే ప్రాణ రక్షణకు అవసరమైన ఆక్సిజన్ వాయువును పొందవచ్చన్నారు. ఇళ్ల వద్ద వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా పారిశుధ్య వాహనాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, సచివాలయం శానిటరీ సిబ్బంది, మలేరియా విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.